## క్లుప్తంగా

### సీసీ కెమెరాలు, స్మార్ట్‌లాక్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్ రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్(రేణిగుంట): అన్ని ఆలయాలు, కల్యాణ మండపాలకు విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రేణిగుంట అర్బన్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. రేణిగుంటలో సోమవారం మండలంలోని అన్ని ఆలయాల ధర్మకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయాలకు సీసీ కెమెరాలు పెట్టుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, వాటి ఆవశ్యకతను గురించి వివరించారు. స్మార్ట్‌లాక్ సిస్టం గురించి డెమో రూపంలో తెలియపరిచి, స్మార్ట్‌లాక్ పెట్టుకోవడం వల్ల దొంగలు బ్రేక్ చేయాలనుకుంటే స్మార్ట్‌లాక్ ఎలా పనిచేస్తుంది ? వాటి నుంచి వచ్చే శబ్దం గురించి వివరించారు. కార్యక్రమంలో గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్, స్టేషన్ సిబ్బంది, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

### పింఛన్ల పరిశీలన


పింఛన్‌దారుడిని పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 9 గ్రామాల్లో పక్షవాతం, కండరాల వ్యాధితో బాధ పడుతున్న రూ.15 వేలు సామాజిత భద్రత పింఛన్ తీసుకుంటున్న 9 మందిని సోమవారం అధికారులు పరిశీలించారు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన వైద్యులు వినీలా, మధుసూదనరావు, వైద్యాధికారి దివాకర్, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, పింఛన్‌దారులను వైద్య పరీక్షలు చేసి పరిశీలించారు.

### మృత్యుంజయుడికి పూజలు


అభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ జలాలు, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

### నివాళి


కత్తి అంకమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జంబుగోళం గ్రామానికి చెందిన సీపీఐ పార్టీ నాయకురాలు సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ కత్తి అంకమ్మ (75) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె మృతదేహానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, జనమాల గురవయ్య, బండి చలపతి, ఉదయ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ అభ్యున్నతి కోసం అంకమ్మ ఎంతో కృషి చేశారని, ఈమె ఇద్దరు కుమారులు కత్తి ధర్మయ్య, కత్తిరవి కూడా పార్టీ కోసం పనిచేసేలా తయారు చేశారని తెలిపారు.

### 28 నుంచి వర్క్ షాప్

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో వైఖానస పాంచరాత్ర శైవాగమాలలో అర్చకత్వ శిక్షణ అనే అంశంపై ఈనెల 28వ తేదీ నుంచి రెండు రోజులపాటు జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆగమ విభాగాధిపతి ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఆగమ పండితులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు వెల్లడించారు.

### శ్రీనివాసునికి వెండి కవచాలు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలోని శ్రీనివాసుని ఉత్సవ మూర్తికి సోమవారం దాతలు వెండి కవచాలను వితరణగా అందించారు. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి అనే దాత సుమారు రూ.1.80లక్షల విలువైన వెండి కవచాలను ఆలయ ఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణికి అందజేశారు.

- మేజర్ పంచాయతీ రేణిగుంటలో అంతులేని అవినీతి
- అధికార పార్టీ నేతల మధ్య విభేదాలతో పంచాయతీ వనరుల వేలం నిలిపివేత
- మరోవైపు గేట్ వసూళ్లలో పంచాయతీ సిబ్బంది చేతివాటం
- కొందరికే రశీదులు ఇస్తూ మిగతా సొమ్ము వాటాలు వేసుకుంటున్న వైనం
- పంచాయతీ ఆదాయానికి భారీగా గండి
- జిల్లా అధికారులు స్పందించాలంటున్న ప్రజలు




# వేలం వాయిదా.. ఆంతర్యం ఇదా?

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రేణిగుంట పంచాయతీకి రాజకీయ గ్రహణం పట్టింది. ఏటా రూ.80 లక్షల వరకు ఆదాయం వచ్చే పంచాయతీలో ఆదాయ వనరులకు వేలంపాట నిర్వహించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో తెలియడం లేదు. మేజర్ పంచాయతీ అయిన రేణిగుంట గతంలో ఆదాయంలో పోటీ పడేది. ఇప్పుడు అవినీతిలో పోటీ పడుతోందని పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఈ పంచాయతీలో షాపులు, మార్కెట్, వారపు సంత, గేట్ వసూళ్లు ప్రధాన ఆదాయ వనరులు. అధికారులు వీటికి ఏటా వేలం నిర్వహించి గుత్తేదారులకు అప్పగిస్తారు. తద్వారా సంవత్సరానికి సుమారు పంచాయతీకి రూ.80 లక్షల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం పంచాయతీ అధికారులు వేలంపాట నిర్వహించకుండా నేరుగా పంచాయతీ సిబ్బంది ద్వారానే గేట్ వసూళ్లు చేస్తున్నారు. ఈ సమయంలో కొందరికే రశీదులు ఇస్తూ, మరికొందరికి ఇవ్వకుండా నగదు వసూలు చేస్తూ పంచాయతీ సిబ్బంది వాటాలు పంచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీలో తాత్కాలికంగా పనిచేస్తున్న సిబ్బందిని వసూళ్లకు పంపడంతో వారు ఇష్టానుసారం దోచుకుంటున్నారు. ఒకరిద్దరు సిబ్బంది ఏకంగా వ్యాపారస్తులను బెదిరించి కూరగాయలు కూడా లాక్కుని వెళ్తున్నారని పలువురు వాపోతున్నారు. జిల్లా కలెక్టరేట్‌కు 6 కిలోమీటర్ల దూరం, మండల కేంద్రంగా ఉన్న మేజర్ పంచాయతీలో ఇంత జరుగుతున్నా.. పైఅధికారులకు ఎవరికీ ఈ విషయం తెలియడం లేదా ? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

### అధికార పార్టీ నేతల విభేదాల వల్లే..

గతంలో వేలంపాట వేయడానికి పంచాయతీ అధికారులు తేదీని కూడా ప్రకటించారు. కానీ స్థానిక అధికార పార్టీ నాయకుల మధ్య తలెత్తిన విభేదాల వల్ల చేసేదేమీ లేక అధికారులు వేలం వాయిదా వేశారు. అప్పటి నుంచి మళ్లీ ఎప్పుడు వేలంపాట నిర్వహిస్తారో తెలియడం లేదు. పంచాయతీ షాపులకు తాళాలు వేసి ఉన్నారు. మరోవైపు పట్టణవాసులు సైతం ఎప్పుడు వేలం నిర్వహిస్తారో అని ఎదురు చూస్తున్నారు. పంచాయతీ ఆదాయానికి గండి పడకుండా.. పంచాయతీ సిబ్బంది అవినీతికి అడ్డుకట్ట వేసి వేలం నిర్వహించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### ఆయా పోస్టులకు నాలుగు దరఖాస్తులు

సత్యవేడు: సత్యవేడు ఐసీడీఎస్ పరిధిలో మూడు ఆయా పోస్టుల భర్తీకి నాలుగు దరఖాస్తులు మాత్రమే అందినట్లు సీడీపీఓ దేవకుమారి తెలిపారు. సత్యవేడు మండలంలోని కొల్లడం(ఎస్సీ) అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టుకు 1, వరదయ్యపాళెం మండలంలోని పులివల్లం (ఎస్సీ) ఆయా పోస్టుకు - 2, అదే మండలంలోని రామిరెడ్డిపాళెం(జనరల్) అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టుకు ఒక దరఖాస్తు అందినట్లు చెప్పారు. సోమవారం సాయంత్రం 4.30 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు ఆమె తెలిపారు.

### భద్రత కల్పించండి


వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నారాయణవనం: మండలంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించడంతో యాజమాన్యంతో చర్చించి చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు తహసీల్దార్ జయరామయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం అనుబంధ కార్మిక సంఘాల నాయకులు జనార్దన్, వెంకటేష్, మహేష్ మాట్లాడుతూ శనివారం రాత్రి మండలంలోని హెర్బల్ ఫార్మా కంపెనీలో లీకైన బాయిలర్‌ను పరిశీలించామని తెలిపారు. పరిశ్రమలు లాభార్జనే కాకుండా కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించామన్నారు.

## ఇసుక తరలింపునకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి


మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాళంగి నది, ఇతర వాగుల నుంచి ఇసుక తరలింపునకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాల్ ఆయన ఇసుక తరలింపుపై గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పోలీసుశాఖ వారితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసు క తరలింపు కోసం తప్పనిసరిగా సంబంధిత గ్రామ కార్యదర్శి వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్య లు తప్పవని హెచ్చరించారు. ఇసుకను మండల ప్రజల అవసరాల కోసమే వాడుకోవాలని, ఇతర ప్రాంతాలకు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకుండా ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ద్వారా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. ఇకపై రిజిస్ట్రేషన్ లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలతో అనర్థాలు


ప్రసంగిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

వరదయ్యపాళెం: బాల్య వివాహాలతో మనుషులకు అనర్థాలు సంభవిస్తాయని, అలాంటి వాటికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర వికాస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా పోలీసులకు, అంగన్‌వాడీ వర్కర్లకు, ఏఎన్ఎంలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్థాయిలో 11-18 వయసు గల యువత ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం, విద్య గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ దేవకుమారి, వైద్యాధికారి అనిత తదితరులు ఉన్నారు.

## మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ


లెనిన్ బాబుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


సాయిదత్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు(లెనిన్ బాబు) సతీమణి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సోమవారం శ్రీరామ్‌నగర్ కాలనీలోని రవీంద్రబాబు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే విధంగా ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన సాయిదత్త కుటుంబ సభ్యులను కూడా మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాల సొసైటీ చైర్మన్ మధుసూదన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తరాజి శరవణ, సురేష్, శ్రీనివాసులు రెడ్డి, మున్నా రాయల్, నాగూర్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రభంజనం


సింధుప్రియ


పావని


సుచిత్ర


హర్షిత

శ్రీకాళహస్తి: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన 2వ సెమిస్టర్ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అన్ని గ్రూపుల్లో మంచి ఫలితాలు సాధించారు. బీఎస్సీ భౌతికశాస్త్రంలో హర్షిత 8.92, ఉపేంద్ర 8.55, తేన్మోలి, రవితేజ, చైతన్య 8.28 జీపీఏ సాధించారు. బీఎస్సీలో సుచిత్ర 9.21, హారిక 8.94, తేజస్విని 8.11, బీఎస్సీ బయోటెక్నాలజీలో పావని 9.01, లికిత 8.82, హసీఫా 8.59, బీకాం సీఏలో సింధుప్రియ 8.68, చాముండేశ్వరి 8.68, రాజేశ్వరి 8.43, చరణ్, గిరీష్, మసీరా తాజ్ 8.08 పాయింట్లు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. వీరిని కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, పీఆర్‌టీయూ నాయకులు

నారాయణవనం: పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ సంఘం(పీఆర్‌టీయూ) వార్షిక క్యాలెండర్‌ను, డైరీని సోమవారం ఎంఈఓలు ప్రభాకర్‌రాజు, జనార్దరాజు సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మణిగండన్, మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

## కంటి వైద్యశిబిరానికి స్పందన


కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి ఇందిరానగర్‌లోని రాస్ కార్యాలయం వద్ద తిరుపతి వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం 89వ జయంతిని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన సేవలు ఎనలేనివని, మహిళా సాధికారతకు చేపట్టిన కార్యక్రమాలను గురించి వివరించారు. వైద్యులు స్థానికులకు కంటి వైద్యపరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి శస్త్ర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. అలాగే వృద్ధులను దుస్తులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ సంయుక్త కార్యదర్శి మమత, పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు, అరవింద్ కంటి ఆస్పత్రి డాక్టర్లు చైతన్య, వంశీకృష్ణ, శిబిర ఆర్గనైజర్లు కుమార్, జీవన్ రావు, ట్రస్టీలు రమేష్ రెడ్డి, సుబ్బరత్నమ్మ, నిత్యసుధ, రామసుబ్బమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్ రెడ్డి కళాశాల విద్యార్థుల ప్రతిభ


కీర్తన


జ్యోతిక


పవన్ కల్యాణ్

శ్రీకాళహస్తి: శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం 2023-24 డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో తొట్టంబేడు మండలానికి చెందిన సీఆర్‌రెడ్డి కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పవన్, కల్యాణిరెడ్డి బీఏ పొలిటికల్ సైన్స్‌లో 6.74, జ్యోతి 6.54, బీకాంలో కీర్తన 8.39, సూర్యదిక్‌పతి 6.83, బీఎస్సీ బోటనీలో చెంచులక్ష్మి 6.65 పాయింట్లు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ యశోద, కరస్పాండెంట్ సి.రాజగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

### సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


ఏర్పేడు: సీతారాంపేటలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ భార్గవి

రేణిగుంట: రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చే వినతులు త్వరితగతిన పరిష్కారమవుతాయని రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు అన్నారు. మండలంలోని కొత్రమంగళంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామ శివారులో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, నివారించాలని స్థానికులు కోరారు. అలాగే ఏర్పేడు మండలం సీతారాంపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ భార్గవి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. టీడీ రోజారమణి, ఆర్ఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి


నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లను నెరవేర్చాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రేణిగుంట ప్రాజెక్టు కార్యదర్శి కె.ధనమ్మ డిమాండ్ చేశారు. యూనియన్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం రేణిగుంటలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ప్రాజెక్టు కార్యదర్శి ధనమ్మ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు, కనీస వేతనం రూ.26వేలు, రూ.10వేలు పెన్షన్, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అన్ని యాప్‌లను కలిపి ఒక యాప్‌గా మార్చి పిల్లలకు చదువు చెప్పేందుకు తగినంత సమయాన్ని ఇవ్వాలన్నారు. అనంతరం నిరసన తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట ప్రాజెక్టు అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలు పాండురంగమ్మ, కోశాధికారి విజయలక్ష్మి, సెక్టార్ లీడర్లు అంబిక, గీత, లక్ష్మి, లీల, శారద, స్వర్ణ, అన్నపూర్ణ, సరస్వతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఇలా అయితే ప్రమాదాలు జరగవా ?


ప్రమాదకరంగా ఉన్న స్వర్ణముఖి ప్రాంతం

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయం చెంతన ఉన్న స్వర్ణముఖి నది స్నానఘట్టం వద్ద ఏర్పాటు చేసిన ఇనుప పైపులు ఇబ్బందికరంగా ఉన్నాయి. స్నానాల కోసం దిగిన భక్తులు నదిలోకి జారిపోకుండా పైపులపై జల్లెడ ఏర్పాటు చేయలేదు. ఇటీవల ఓ వ్యక్తి నదిలో పడి దుర్మరణం చెందాడు. అయినా అధికారులు భద్రతా చర్యలు చేపట్టలేదు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముక్కంటి ఆలయానికి భక్తులు భారీసంఖ్యలో రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా ముందే ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ట్రాఫిక్.. పెడతారా చెక్..



జయరామారావు వీధిలో స్తంభించిన ట్రాఫిక్

శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు ఎప్పుడు తీరుతాయా అని పట్టణవాసులు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా జయరామారావువీధిలో రోడ్డు చాలా ఇరుకుగా ఉంది. ఈ వీధిలోనే బ్యాంకులు, వ్యాపార సంస్థలు ఎక్కువగా ఉన్నాయి. పైగా వన్‌వే. అయితే కొంతమంది వాహనదారులు ఇవేమీ పట్టించుకోకుండా అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడం.. ఎదురుగా వెళ్లడం చేస్తున్నారు. దీనికితోడు ఈ వీధిలోని ఓ జనరల్ స్టోర్ యజమాని ఎప్పుడు పడితే అప్పుడు సరుకులను దించుకునేందుకు టెంపో వాహనం వస్తుండడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. పూర్ణం బేకరి నుంచి బేరివారిమండపం మధ్యలో ప్రతిరోజు ఏదో ఒక సమయంలో వాహనాలు ఆగిపోయి ట్రాఫిక్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. - శ్రీకాళహస్తి